ఎప్‌సెట్ ఇంజినీరింగ్‌కు 364 మంది హాజరు

రామగిరి, మే 8 : నల్లగొండలోని ఎస్‌పీఆర్ స్కూల్ ఆవరణలోని ఆన్‌లైన్ పరీక్ష కేంద్రంలో తెలంగాణ స్టేట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2024లో భాగంగా గురువారం మూడోరోజు ఇంజినీరింగ్‌లో ప్రవేశానికి విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షకు 185 మంది విద్యార్థులకు 180, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 185మందికి 184మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్ష కేంద్రం నిర్వాహకుడు నీలంరెడ్డి వెల్లడించారు.

మోసపోతే గోసపడుతం

- కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలోనే 40ఏండ్ల నరకం
- నీళ్లు ఉన్నా పంటలను ఎండపెట్టిన అసమర్థ ప్రభుత్వమిది
- కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంటు కష్టాలు.. కరువును ఆహ్వానించినట్లే
- తెలంగాణకు బీఆర్‌ఎస్సే శ్రీరామరక్ష
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్ మండలం లింగాలలో గ్రామస్తులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్, మే 9 : నాలుగు నెలల పాలనలోనే ప్రజలకు నలభై ఏండ్ల నరకాన్ని చూపించిన పాపం కాంగ్రెస్ పార్టీదని, మళ్లీ మోసపోతే గోసపడుతామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. పెన్‌పహాడ్ మండలం లింగాల గ్రామంలో గురువారం రాత్రి ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు, రైతులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ పాలనలో తాము ఎదుర్కొంటున్న కరెంటు కష్టాలు, గత ప్రభుత్వ పథకాలు ఆగిపోవడంతో పడుతున్న ఇబ్బందులను గ్రామస్తులు వివరించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కండ్లుగా భావించి కొట్లాది రూపాలను ఖర్చు చేశామన్నారు. తెలంగాణలోని వనరులు దోపిడీకి గురికాకుండా ఉండాలంటే బీఆర్‌ఎస్ ఉండాలని ప్రజలు గ్రహించారని తెలిపారు. కాంగ్రెస్ అబద్ధపు వాగ్దానాలు నమ్మి ఒకసారి మోసపోయిన ప్రజలు మరోసారి నమ్మేందుకు సిద్ధంగా లేరన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కరెంటు కష్టాలు, కరువును ఆహ్వానించినట్లేనని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో నాగార్జున సాగర్‌లో నీటి మట్టం డెడ్ స్టోరేజ్‌లో ఉన్నా సాగునీరు ఇచ్చి పంటలను కాపాడామని తెలిపారు. ప్రస్తుత పాలనలో పంటలను ఎండబెట్టి తూముల వద్ద పోలీసులను కాపలా పెట్టి కిందికి తరలించుకుపోయారని విమర్శించారు. సొంత జిల్లా రైతులకు అన్యాయం జరుగుతున్నా ఇక్కడి మంత్రులు నోరు మెదపకపోవడం మన దౌర్భాగ్యమన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ధాన్యం దిగుబడిలో దేశంలో తెలంగాణ నెంబర్ వన్‌గా నిలించిందని తెలిపారు. మళ్లీ మన నీరు, మన కాల్వలు, మన కరెంటు మనకు రావాలంటే కేసీఆర్ చేతికి ఓటు అనే ఆయుధంతో మంత్రదండం ఇవ్వాలని కోరారు. కేసీఆర్ నాయకత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి మన హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, ఎంపీపీ నెమ్మాది భిక్షం, వైస్ ఎంపీపీ గార్లపాటి సింగారెడ్డి, నాయకులు వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, దొంగరి యుగంధర్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి 69మంది నామినేషన్

- ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- నేడు నామినేషన్ల పరిశీలన, 13 వరకు ఉపసంహరణకు గడువు

నల్లగొండ ప్రతినిధి, మే 9 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ - వరంగల్ - ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగిసింది. మూడు జిల్లాల పరిధిలో ప్రధాన పార్టీలతోపాటు వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 69 మంది 117 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ గత నెలలో విడుదల కాగా, ఈ నెల 2నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. సెలవు రోజు మినహాయించి ఏడు రోజుల పాటు జిల్లా రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన నామినేషన్లను స్వీకరించారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన చేసి అమోదించిన నామినేషన్లకు అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. ఈ నెల 13వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉన్నది. ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నారు.

సుమారు 12 రోజులపాటు ప్రచారం నిర్వహించి 14వ రోజైన మే 27న పోలింగ్ నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తుంది. కాగా, బీఆర్‌ఎస్ నుంచి ఏనుముల రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్‌కుమార్), బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ప్రధాన పార్టీల తరపున నామినేషన్లు వేశారు. వీరు కాకుండా రాష్ట్రీయ పార్టీలతో పాటు స్వతంత్రులుగా పలువురు నామినేషన్లు దాఖలు చేశారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పరిశీలకుడిగా రాహుల్ బొజ్జ

నీలగిరి, మే 9 : వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల పరిశీలకుడిగా తెలంగాణ క్యాడర్‌కు చెందిన 2000 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ఎస్‌హెచ్ రాహుల్ బొజ్జను నియమిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం ఆయన నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి చాంబర్‌కు నామినేషన్ల పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ దాసరి హరిచందన మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ములుగు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్, నల్లగొండ జిల్లా రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఉన్నారు.

సూర్యాపేట మున్సిపాలిటీలోని 44వ వార్డులో ప్రచారంలో భాగంగా టిఫిన్ సెంటర్‌లో పూరీ కాలుస్తున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

వైఫల్యాల కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు

- బీఆర్‌ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్
- సూర్యాపేటలో జోరుగా ఎన్నికల ప్రచారం

సూర్యాపేట టౌన్, మే 9 : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేని వైఫల్యాల కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తప్పదని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. బీఆర్‌ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి మద్దతుగా గురువారం పార్టీ శ్రేణులతో కలిసి సూర్యాపేట మున్సిపాలిటీలోని 44వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాయ మాటలతో అధికారంలోకి వచ్చి, నాలుగు నెలలు గడిచినా ఒకటి, రెండు మినహా హామీలన్నింటినీ గాలికి వదిలేసిందన్నారు. అధికారంలోకి రాగానే హామీలన్నీ అమలు చేస్తామని, ఆ తర్వాత వంద రోజులని, త్వరలోనే అంటూ కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్.. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు దండుకుని పబ్బం గడుపుకొనే పనిలో ఉన్నదని విమర్శించారు. అధికార యావ తప్ప ప్రజల ఇబ్బందులు పట్టని కాంగ్రెస్ మాయ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో రైతు బంధు, రైతు బీమాతోపాటు సంక్షేయ పథకాలన్నీ పారదర్శకంగా అమలయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యంతో రైతు బంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి నిర్లక్ష్య పాలనకు తగిన బుద్ధి చెప్పాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గండూరి ప్రకాశ్, బండారు రాజా, కొండపల్లి సాగర్‌రెడ్డి, బూర బాలసైదులు గౌడ్, సయ్యద్ సలీమ్, బత్తుల రమేశ్, నల్లపాటి అప్పారావు, వెన్న శ్రీనివాస్‌రెడ్డి, వీరస్వామి, ప్రకాశ్, సురేశ్, సల్మా మస్తాన్, కరుణశ్రీ, అంజమ్మ, మహేశ్వరి పాల్గొన్నారు.

మిగిలింది రెండ్రోజులే..

- సమీపించిన ఎన్నికల ప్రచార గడువు
- 11వ తేదీ సాయంత్రం వరకే క్యాంపెయిన్
- జోరుగా బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

యాదాద్రి భువనగిరి, మే 9 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలకు కౌంట్ డౌన్ దగ్గర పడింది. రాజకీయ పార్టీల ప్రచారానికి మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఈ నెల 11వ తేదీ సాయంత్రానికి క్యాంపెయిన్ ముగియనుంది. బీఆర్‌ఎస్ భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేశ్ జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో అగ్రనేతలు పర్యటించారు.

పార్లమెంట్ ఎన్నికలకు గత నెల 18న నోటిఫికేషన్ విడుదలైంది. అదే నెల 25వరకు నామినేషన్లను స్వీకరించారు. 26న నామపత్రాల పరిశీలన, 29వరకు నామినేషన్ పత్రాల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. దాంతో అన్ని పార్టీలు ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టారు. జనంలోకి వెళ్లేందుకు అన్ని రకాల ప్రణాళికలు చేసుకున్నారు. ఇందుకోసం అందివచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేశారు. ప్రచార రథాలతో గల్లీగల్లీని చుట్టేస్తున్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో అధిక ప్రాధాన్యం ఇచ్చారు. గెలిస్తే ఏం చేస్తామో వివరిస్తున్నారు.

జనంతో మమేకమైన క్యామ

బీఆర్‌ఎస్ భువనగిరి అభ్యర్థిగా క్యామ మల్లేశ్‌ను గులాబీ బాస్ కేసీఆర్ ఎంపిక చేసినప్పటి నుంచి గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉదయం, రాత్రి, ఎండ, వేడి అనే తేడా లేకుండా ప్రజలతో మమేకమవుతున్నారు. ప్రతి రోజూ మూడు నుంచి నాలుగు మండలాలు పర్యటిస్తున్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యేల సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. తనదైన శైలితో ప్రసంగిస్తూ జనాన్ని ఆకట్టుకుంటున్నారు. బీఆర్‌ఎస్‌ను ఎందుకు గెలిపించాలో స్పష్టంగా వివరిస్తున్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో సీనియర్ నేతలు ఎన్నికల ప్రచారంలో పనిచేస్తుండగా, గ్రామాల్లోనూ కేడర్ జోరుగా దూసుకెళ్తున్నది. బీఆర్‌ఎస్‌ను ఎలాగైనా గెలిపించుకోవాలనే కసితో ప్రచారం చేస్తున్నది. ఎండలను సైతం లెక్క చేయకుండా ఇంటింటి ప్రచారానికి వెళ్తున్నది. కరపత్రాలు పంచుతూ బీఆర్‌ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్నది. అంతే కాకుండా అలవి కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగడుతున్నది. బీఆర్‌ఎస్ ఎందుకు గెలవాలో తెలియజేస్తున్నది. దాంతో ప్రజలు సైతం బీఆర్‌ఎస్‌కు పెద్దఎత్తున మద్దతు తెలియజేస్తున్నారు.

అగ్రనేతల క్యాంపెయిన్..

భువనగిరి పార్లమెంట్ పరిధిలో దాదాపు అన్ని పార్టీల అగ్రనేతలు ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ బస్సు యాత్రలో భాగంగా భువనగిరి పట్టణంలో జరిగిన రోడ్ షోలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ హాజరయ్యారు. దాంతో కారు పార్టీలో ఫుల్ జోష్ నెలకొంది. ఇక చండూరులో జరిగిన సభలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఇక మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సైతం ఉమ్మడి జిల్లాలో క్షణం తీరిక లేకుండా ప్రచారం చేస్తున్నారు. భువనగిరిలో జరిగిన కాంగ్రెస్ కార్నర్ షోకు సీఎం రేవంత్ రెడ్డి, రాయగిరిలో బీజేపీ బహిరంగ సభకు ఆ పార్టీ అగ్రనేత అమిత్ షా, చౌటుప్పల్‌లో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరయ్యారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీని బొంద పెట్టాలి

- బీఆర్‌ఎస్ పార్టీకే మా మద్దతు
- తెలంగాణ మాదిగ హక్కుల దండోరా

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు మొండికత్తి లింగన్న మాదిగ

నల్లగొండ రూరల్, మే 9 : మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్, బీజేపీని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బొంద పెట్టడానికి మాదిగలు సిద్ధంగా ఉన్నారని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు మొండి కత్తి లింగన్న అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంపూర్ణ మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకి ఇస్తున్నట్లు ప్రకటించారు. వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ మాట ఇచ్చి తప్పిందన్నారు. కాంగ్రెస్ అమలు కాని మోస పూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని, ఈ రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలోనే మాదిగలకు ఎన్నో సంక్షేమ ఫలాలు అందాయని చెప్పారు. కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకునేందుకు ప్రతి మాదిగ ముందుకు వచ్చి కారు గుర్తుకు ఓటేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు, జిల్లా యువసేన ఇన్‌చార్జి జిల్లా నరేందర్, ఇంజమూరు వెంకటేశ్వర్లు, కృష్ణ, చంద్రయ్య, బంగారి కోటయ్య, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

కాంగ్రెస్ అబద్ధపు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్
- బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

కొండమల్లేపల్లి, మే 9 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చి అమలు చేయని అబద్ధపు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. నెల రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరిన రామునిగుండ్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందులో ఇమడలేక గురువారం సొంత గూటికి చేరారు. వారికి రవీంద్రకుమార్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు నెలల కాంగ్రెస్ పాలనలో కక్షపూరిత వైఖరి, నిర్లక్ష్యం, అవగాహనా రాహిత్యంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలిశాయని, వారు మళ్లీ బీఆర్‌ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ గ్రాఫ్ పూర్తిగా పడిపోయిందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అత్యధిక సీట్లు గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్, నాయకులు కడారి అంజయ్య యాదవ్, మారం రవీందర్‌రెడ్డి, కేసాని లింగారెడ్డి, తులసీరాం నాయక్, నరేందర్, సత్యనారాయణ, శేఖర్‌యాదవ్, గిరి, పాండు, బాలూనాయక్ పాల్గొన్నారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

రేవంత్‌రెడ్డి మాటలను ప్రజలు నమ్మరు

- భువనగిరి ఎంపీగా క్యామ మల్లేశ్‌ను గెలిపిస్తాం
- తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తుంగతుర్తి, మే 9 : సీఎం రేవంత్‌రెడ్డి గారడి మాటలను ప్రజలు నమ్మరని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని గొట్టిపర్తి గ్రామంలో గురువారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. అవగాహన లేని వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తున్నారని, రైతుల రుణమాఫీ జరుగాలంటే సుమారు రూ.30వేల కోట్లు అవసరమని, నిధులు లేకున్నా మాయ మాటలు చెబుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం జలాల ద్వారా సుమారు లక్షా 40వేల ఎకరాలకు సాగునీరు అందించినట్లు తెలిపారు. ఇప్పుడు 80వేల ఎకరాలకు కూడా నీరు అందించలేదని, చాలా చోట్ల పొలాలు ఎండిపోయాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాయ మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. భువనగిరి ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. మల్లేశ్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ శ్రీశైలంయాదవ్, నాయకులు గుండగాని రాములుగౌడ్, హరిబాబు, సాయిలు, శ్రీనివాస్, హరీశ్‌యాదవ్, సోమన్న, లింగయ్య, మురళి, వెంకన్ననాయక్, రవికుమార్, పూర్ణానాయక్, వెంకన్న, రాములు పాల్గొన్నారు.

రైతు బంధుపై నీలినీడలు !

- ఇంకా పూర్తి స్థాయిలో అందని పంట పెట్టుబడి సాయం
- మరో నెలలో వానకాలం సాగు
- ఐదెకరాల్లోపు వారికేనా.. సాగు చేసిన రైతులకేనా?
- రైతుబంధు రూ.10 వేలకే దిక్కులేదు.. రైతు భరోసాకు రూ.15 వేలు ఇస్తారా?
- సీఎం, మంత్రుల విరుద్ధ ప్రకటనల పట్ల రైతుల్లో ఆందోళన
- కాంగ్రెస్ సర్కారుపై మండిపడుతున్న అన్నదాతలు

సూర్యాపేట, మే 10 (నమస్తే తెలంగాణ) : పంట పెట్టుబడికి రంది లేకుండా చేసేందుకు అన్నదాతకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని తీసుకొచ్చింది. ఎకరాకు రూ.5వేల చొప్పున ఏటా రెండు సీజన్‌లకు రూ.10 వేలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. కానీ కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత రైతు బంధు సక్రమంగా అమలు కావడం లేదు. ఎన్నికల ముందు ఆ పార్టీ రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి ఎకరాకు రూ.15 వేల ఇస్తామని హామీ ఇవ్వగా అదీ నెరవేరలేదు. రైతు బంధు పథకాన్ని కాంగ్రెస్ సర్కారు మొత్తానికే ఎత్తివేసే కుట్ర పన్నుతున్నట్లు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. 'ఐదెకరాల లోపు వారికే ఇస్తాం, సాగు చేసిన భూములకు మాత్రమే ఇస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు పదేపదే రైతు భరోసాపై విరుద్ధ ప్రకటనలు చేయడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయాల కోసం కాళేశ్వరాన్ని పండబెట్టి, అవకాశం ఉన్నా నాగార్జునసాగర్ నీటిని విడుదల చేయకుండా రైతులపై స్వయం ప్రకటిత కరువును రుద్దిన కాంగ్రెస్ సర్కారు మరోపక్క సాగు చేస్తేనే పంట పెట్టుబడి సాయం ఇస్తామనడంపై వ్యవసాయాన్ని ప్రమాదంలోకి నెట్టివేస్తున్నట్లు అర్థమవుతున్నది. సాగు చేసే రైతులకే మొండి చెయ్యి చూపిస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు ఎలా రైతు భరోసా ఇస్తుందో మరీ.

కేసీఆర్ హయాంలో 11 సీజన్లకు నిరంతరాయంగా..

2018లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన రైతు బంధు ద్వారా నిరంతరాయంగా 11 సీజన్‌లకు పంట పెట్టుబడి సాయం అందించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 22 లక్షల ఎకరాలకు సంబంధించి రైతుల బాంకు అకౌంట్లలో డబ్బులు జమయ్యాయి. దాంతో పంట పెట్టుబడికి వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లే పరిస్థితి రైతులకు తప్పింది. రైతు బంధు సాయం చేయడంతోపాటు పండిన ధాన్యాన్ని కూడా కేసీఆర్ సర్కారు కేంద్రాలు ఏర్పాటు చేసి కొన్నది. కానీ నాలుగున్నర నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ యాసంగి సీజన్ పూర్తయి పంటలు చేతికి అందినా ఇంకా పూర్తి స్థాయిలో రైతు బంధు ఇవ్వలేదు. ఇప్పటివరకు ఐదెకరాల్లోపు రైతులకు మాత్రమే రైతు బంధు వచ్చింది. మరో నెల రోజులైతే వానకాలం సీజన్ ప్రారంభం కానుండగా రెండు సీజన్లకు సంబంధించి రైతు బంధు ఇస్తుందో లేదోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ కొత్తగా అమలు చేస్తున్న రైతు భరోసా ఇస్తుందా.. ఉన్నదానికే కొర్రీలు పెట్టి బంద్ చేసే కుట్ర పన్నుతుందా? అనేదానిపై రైతుల్లో ఆందోళన మొదలైంది.

సాగుకు ముందు సాయం అందిస్తేనే ఉపయోగం



నాకు 4 ఎకరాల భూమి ఉంది. గత కేసీఆర్ ప్రభుత్వం రెండు సీజన్లకు సాగు పనులు ప్రారంభం కాక ముందే పెట్టుబడి సాయం ఇచ్చేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత యాసంగి సీజన్‌లో వడ్లు అమ్మిన తర్వాత రైతుబంధు డబ్బులు వేసినరు. దాని వల్ల రైతులకు పెద్దగా ప్రయోజనం లేదు. పెట్టుబడి కోసం బయట అప్పులు తెచ్చినం. వాటికి వడ్డీ కడుతున్నం. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ. 15వేలు ఇస్తమని చెప్పింది.. అదికూడా లేదు. వానకాలం సీజన్‌లో అయినా రైతుబంధు డబ్బులు సాగుకు ముందే వేయాలి. లేక పోతే రైతులను మోసం చేసినట్లే అవుతుంది.

-గుంటి రవికుమార్,రైతు, బొల్లంపల్లి, అర్వపల్లి మండలం

రైతులు అప్పుల పాలవుతున్నరు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు సాయం సీజన్ మొదట్లో కాకుండా పంట కోతలు పూర్తయ్యాక ఇవ్వడం సరికాదు. పంటలు సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం రైతులు అప్పు చేయాల్సి వస్తున్నది. పంట దిగుబడి సరిగా రాకపోతే అప్పులు పెరిగి రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వస్తది. గత కేసీఆర్ ప్రభుత్వం సీజన్‌లో పంటల సాగుకు ముందే రైతుబంధు సాయం అందించడంతో రైతులకు అప్పుల బాధలు లేకుండా పోయాయి. కానీ ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి పంటలు పూర్తయ్యాక రైతుబంధు సాయం అందిస్తానంటున్నరు. ఇలా చేస్తే రైతులకు పెద్దగా ప్రయోజనం ఉండదు.

-సోమిరెడ్డి పెద వెంకటరెడ్డి, రైతు, ఆత్మకూర్.ఎస్

ఎన్నికల నిబంధనలు పటిష్టంగా అమలు

- ఎస్పీ రాహుల్ హెగ్డే


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, మే 9 : లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తున్నందున రానున్న 72 గంటలు ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేస్తామని, ఈ నెల 11 నుంచి 13 వరకు ముందస్తుగా జిల్లా వ్యాప్తంగా 48 గంటలు నిబంధనలు పటిష్టంగా ఉంటాయని ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన మాట్లాడారు. స్థానికేతరులు, ఓటర్లు కాని వారు గ్రామాల్లో, వార్డుల్లో, కాలనీల్లో ఆశ్రయం తీసుకుని ఉండొద్దన్నారు. హోటల్స్, లాడ్జీల్లో కొత్త వ్యక్తులను ఉండనియొద్దని, కొత్త వ్యక్తులకు గ్రామాల్లో ఆశ్రయం కల్పించవద్దని కోరారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లా అంతటా పటిష్ట నిఘా కొనసాగుతున్నట్లు ఎవరూ గొడవలు పెట్టుకోవద్దని, సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేయొద్దని పేర్కొన్నారు.